# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 20, జనవరి 2026


### వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ

# త్వరగా పూర్తి చేయాలి

● రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క

**ఆసిఫాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:**



ప్రభుత్వం మహిళల ఆర్దిక అభివృద్ధి కోసం చేపట్టిన వడ్డీ లేని రుణాల పథకంలో పట్టణ మహిళా సంఘాల సభ్యులకు రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు బట్టి విక్రమార్క అన్నారు. సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశువు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సెర్ప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దివ్య దేవరాజన్, పట్టణ అభివృద్ధి శాఖ కార్యదర్శి టి. కె. శ్రీదేవి లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మెప్మా అధికారులు, బ్యాంకు అధికారులతో వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ పట్టణ మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు, అర్హులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. మహిళ సంఘాలలో సభ్యులుగా లేని వారిని రేషన్ కార్డు ఆధారంగా మిగతా 2లో..





# రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత

✻ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు

**కాగజ్‌నగర్ రూరల్, జనవరి 19, ప్రభాతవార్త :**

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృృతిక, ఆబ్కారీ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా ఎస్.ఏ. నితికా పంత్, శాసనమండలి సభ్యులు దండే విఠల్, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా ఇన్చార్జి విద్యాధికారి దీపక్ తివారి, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, కాగజ్ నగర్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్యలతో కలిసి హాజరై అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులను చేపడుతుందని, సంక్షేమ పథకాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, గృహ జ్యోతి, 500 రూపాయలకే రాయితీ సిలిండర్, స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామని, ఇందులో భాగంగా జిల్లాలో విద్య, వైద్య అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి, ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు కృషి చేసిన జిల్లా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తుందని, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడం జరుగుతుందని తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ కాగజ్ నగర్ పట్టణానికి 100 పడకల ఆసుపత్రి మంజూరు చేసి 18 కోట్ల రూపాయలతో పట్టణంలో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 35 కోట్ల రూపాయలతో పట్టణానికి త్రాగునీరు కొరకు నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందని మిగతా 2లో..

# పట్టపగలే మెడలో గొలుసు దొంగతనం



సిసి కెమెరాలో రికార్డయిన దృశ్యం

**ఆసిఫాబాద్, జనవరి 19, ప్రభాతవార్త :**

జిల్లా కేంద్రంలోని గుండి రోడ్డు సాయినగర్‌లో పట్టపగలే మహిళా మెడలో గొలుసు దొంగతనం జరిగిన సంఘటన కలకలం రేపుతోంది. సాయినగర్‌లోని కే. శంకర్ ఇంట్లో నివాసం ఉంటున్న బాధితురాలు అంజలి తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం 7. 30 గంటలకు ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి వాహనాన్ని పార్కింగ్ చేసుకోవడానికి అనుమతి అడిగారని తెలిపారు. దానికి యజమాని లేదని సమాధానం చెప్పగా పక్కన పార్కింగ్ చేస్తున్నాము, ఒకసారి వచ్చి చూడండని వారు కోరినట్లు వివరించారు. గేటు వద్దకు వచ్చి చూద్దామనే లోపు మెడలో చైన్ లాగారని కొద్దిసేపు గట్టిగా పట్టుకున్నప్పటికీ లాక్కొని వెళ్ళిపోయారని వాపోయింది. మూడు తులాల వరకు ఉండే బంగారు గొలుసు దుండగులు దొంగతనం చేయడంపై బాధితురాలు కన్నీరు మున్నీరయింది. సీసీ కెమెరాల ఫొటేజీ ఆధారంగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో చైన్ స్నాచర్లు తిరుగుతున్నారని సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో మహిళలు అప్రమత్తమయ్యారు. ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

### కేస్లాపూర్‌లో వైభవంగా

# ప్రారంభమైన నాగోబా జాతర

★ శాస్త్రోక్తంగా మహాపూజ నిర్వహించిన మెస్త్రం వంశీయులు

★ జాతరను ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యేలు

★ నాగోబా దేవతకు హారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

2 లో..

– ఆదిలాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:




దుప్పటి పంపిస్తున్న సీఐటియూ కన్వీనర్ ఆనందరావు, ఎస్ఐ మధుకర్

## నిరుపేదలకు అండగా నిలవడమే నిజమైన సమాజ సేవ

### ● వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**కెరమెరి జనవరి 19 ప్రభాతవార్త**

నిరుపేదల కష్టసమయంలో అండగా నిలవడమే నిజమైన సమాజ సేవ అని సిఐటియు మండల కన్వీనర్ కూటికెల ఆనంద్ రావు అన్నారు. మండలంలోని కేళి (కే) కోలాంగూడా గ్రామంలో సోమవారం 25 నిరుపేద కుటుంబాలకు సొంత ఖర్చుతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ ఐ మధుకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చదువుపై దృష్టి సాధించాలన్నారు పోలీసులు ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటారని సైబర్ క్రైమ్ విషయంలో జాగ్రత్త వహించాలని కోరారు చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు మీ దృష్టికి వస్తే వెంటనే 100 డయల్ చేయాలని సూచించారు ఆపదలో ఉన్న వారికి ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రతి ఒక్కరూ తమ సామర్థం మేరకు సహాయం చేయాలని కోరారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవీయ విలువలను బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. సమాజ మంచికి తోడ్పడే ఇటువంటి కార్యక్రమాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ప్రజల రక్షణ భద్రత పోలీసుల బాధ్యత అని ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా జరగాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చోలే నాగనాథ్ మాజీ సర్పంచ్ సంగ్రామ్ ఎర్రవార్ ఘోషం మాణిక్ రాజు గణేష్ లాల గ్రామ పటేల్ గ్రామస్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మనవత్వానికి ప్రతీకగా నిలిచిన ఈ సేవా కార్యక్రమం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తుందని గ్రామస్తులు కొనియాడారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### * ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు అంబాజీ

**ఉట్నూర్,జనవరి 19, ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు అంబాజీ అన్నారు. సోమవారం ఐ టి డి ఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పలువురు ఆదివాసీలు తమకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బీంపూర్ మండలానికి చెందిన శ్రీకాంత్ తనకు డ్రైవర్ ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. తిర్యాణి మండలానికి చెందిన జంగు భాయ్ తాను బి . ఎస్ సి. నర్సింగ్ కోర్సు చేస్తున్నానని, స్టడీ మెటీరియల్ కొరకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కొందరు గిరిజన రైతులు అటవీ భూముల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఉపసంచాలకులు మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారులు అందించిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు అంబాజీ


శిక్షణ తరగతులలో పాల్గొన్న సర్పంచులు.


సర్పంచ్‌ల శిక్షణ తరగతులలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

# గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పరిపాలన సాగించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**హాజీపూర్, జనవరి 19, ప్రభాతవార్త**

గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పరిపాలన సాగించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్లాలో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో నూతన సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతిలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తూ పంచాయత వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల ఆశయాలను నెరవేర్చే బాధ్యత సర్పంచ్‌లదే అని, ప్రభుత్వ పథకాలు, ఆర్థిక వ్యవస్థ, పాలన విధానాలు, నిబంధనలు, నిర్వహణ అంశాలలో పూర్తి పరిజ్ఞానం కలిగి ఉండడం అవసరమని తెలిపారు. శిక్షణలో గ్రామ పంచాయతీ విధులు, అధికారాలు, గ్రామ అభివృద్ధి ప్రణాళిక తయారీ విధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు-అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, బడ్జెట్ తయారీ, ఖాతాల నిర్వహణ, గ్రామ పంచాయతీ రికార్డులు, రిజిస్టర్లు, డిజిటల్ సర్వీసులు, ప్రజాసేవలో పారదర్శకత, బాధ్య, మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సమానత్వం, స్వచ్ఛ భారత్, హరిత హారం, పరిశుభ్రత కార్యక్రమాలు, ప్రజలతో సంబంధాలు-వినతులు, ఫిర్యాదుల పరిష్కారం, గ్రామస్థాయిలో నాయకత్వ లక్షణాలు వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్థాయిలో పరిపాలన సమర్థవంతంగా అమలు చేసేందుకు అవసరమైన నైపుణ్యం, జ్ఞానం అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామ పాలనలో నూతన దృక్పథంతో ముందుకు సాగేందుకు శిక్షణ తోడ్పడుతుందని, సంబంధిత మండలాలకు చెందిన సర్పంచ్‌లు నిర్ణీత తేదీ, సమయం, స్థలం లో తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమం గ్రామాభివృద్ధికి అత్యంత కీలకమైనదని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్, చెన్నూర్, హాజీపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మోహన్, సాయి వెంకట రెడ్డి, మండల పంచాయతీ అధికారులు శ్రీపతి బాపురావు, అనిల్, శ్రీనివాస్, పి. వెంకటేష్, మహేష్, పంచాయితీ కార్యదర్శులు, డి.పి.ఎం. సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## సమస్యలను పరిష్కరించాలని బిజెపి ధర్నా

**బెల్లంపల్లి, జనవరి 19, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో పట్టణ అధ్యక్షులు దార కళ్యాణి ఆధ్వర్యంలో 34 వార్డులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, బెల్లంపల్లి పట్టణ మున్సిపల్ ఎన్నికల కో కన్వీనర్ జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్, మాజీ మున్సిపల్ చైర్మన్ అమరాజుల రాజేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో 34 వార్డులలో అనేక సమస్యలు ఉన్నాయి వాటిలో ప్రధానమైన సమస్య మంచినీటి సమస్య 34 వార్డులకి గోదావరి నీరు రాక కొన్ని సంవత్సరాలు గడిచినా కూడా ఇప్పటివరకు గోదావరి నీరు జాడే లేదు, ఇచ్చే అడా ప్రాజెక్టు వాటర్ కూడా 15, 20 రోజులకు ఒకసారి వస్తున్నాయి. వెంటనే వాటర్ సమస్యను పరిష్కరించాలి అంతేకాకుండా చెత్త బండ్లు రాక అనేక వార్డులలో చెత్తలు పేరుకుపోతున్నాయి. 18వ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం కోసం తవ్వి రెండు సంవత్సరాలు పూర్తయిన కూడా ఇప్పటివరకు పట్టించుకోలేదు. ఇలా రోడ్లు సరిగా లేకపోవడం వలన అత్యవసర సమయంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం జరిగింది. అలాగే వీధుల్లో కుక్కల బెడద, పందులు, కోతుల బెడద పెరిగిపోయి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు కావున ఈ మున్సిపాలిటీలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నాయకులు దూది ప్రకాష్ జిల్లా ఎస్సీ మోర్చా కార్యదర్శి, కల్లపల్లి నవీన్ పట్టణ ఉపాధ్యక్షులు, బాసబోయిన యుగేందర్, అలకాటి మహేష్, ఎర్రోజ శ్రీనివాస్, షేక్ గౌస్ బాబా, గర్రెపల్లి రాకేష్, బాబు, రామన్న, సత్తన్న, విజయ లక్ష్మి, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## మితిమీరిన వేగం ప్రమాదాలకు కారణం

### - హజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్

**హాజీపూర్, జనవరి 19, ప్రభాతవార్త**

రహదారులపై మితిమీరిన వేగంతో వాహనాలు నడిపినట్లయితే ప్రమాదాలు జరిగే అవకాశం అధికంగా ఉంటుందని, వాహనం నడిపేటప్పుడు నిర్దేశిత వేగాన్ని పాటించాలని హాజీపూర్ ఎస్సై కిరణ్ కుమార్ అన్నారు. అరైవ్ అలైవ్-2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడిపేటలోని ఆర్ అండ్ ఆర్ కాలనీ బ్లాక్ స్పాట్ వద్ద ఏర్పాటు చేసిన రహదారి భద్రతా నిబంధనలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వలన ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాహనదారులు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడపకూడదని, రహదారులపై నిర్దేశిత వేగంతో మాత్రమే వాహనాలను నడపాలని తెలిపారు. 18 సంవత్సరాల వయసు నిండి అర్హత కలిగిన వారు లైసెన్స్ పొందాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధృవపత్రాలను కలిగి ఉండాలని తెలిపారు. మద్యం సేవించి వాహనం నడుపుతూ తనిఖీలలో పట్టుబడినట్లైతే లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, అయినప్పటికీ వాహనాలు నడిపినట్లయితే సదరు వ్యక్తికి సంబంధించిన లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, రోడ్డు ప్రమాదాలను నివారించాలని, అనుకోనివిదంగా రోడ్డు ప్రమాదం జరిగితే క్షతగాత్రులను త్వరితాగతిన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించి, పోలీస్ వారికి సమాచారం అందించాలి అని తెలియ జేశారు.


రహదారుల భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కిరణ్ కుమార్

# ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

**- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్, జనవరి 19, ప్రభాతవార్త:**

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను కలెక్టర్‌కు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పర్యవేక్షించాలని తెలిపారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున, మండల ప్రత్యేక అధికారులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల సన్నద్ధతను సమీక్షిస్తూ ఉండాలని సూచించారు. ఇటీవలి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా పూర్తి



ఫిర్యాదులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

చేసినందుకు, ముఖ్యమంత్రి కార్యాలయం, అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసిందని వివరించారు. సీఎం పర్యటన విజయవంతం చేసినందుకు అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి కలెక్టర్ మరోసారి ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓ రత్నకళ్యాణి, జెడ్పీ సీఈవో శంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మార్కెట్ కమిటీ, రైస్ మిల్ యాజమాన్యం

## సమాజానికి దిశానిర్దేశం చేసేవే వార్తాపత్రికలు

**మందమర్రి, జనవరి 19, ప్రభాతవార్త**

వార్త ప్రతిక క్యాలెండర్‌ను మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో గల వర్ణ రైస్ మిల్లు యాజమాన్యం, మందమర్రి మార్కెట్ వర్తక వ్యాపార సంఘం కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలకు తెలియజేయడంలో వార్తాపత్రికలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రజలు-ప్రభుత్వం మధ్య అనుసంధానంగా నిలుస్తూ, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తున్నాయి. నిజాలను నిష్పక్షపాతంగా వెలుగులోకి తెచ్చి, ప్రజా సమస్యలపై అవగాహన కల్పిస్తూ పరిష్కారానికి దారి చూపుతున్నాయి. సమాచార సాంకేతిక యుగంలోనూ వార్తాపత్రికలు తమ విశ్వసనీయతతో ప్రజల నమ్మకాన్ని నిలుపుకుంటూ సమాజ నిర్మాణానికి దోహదపడుతున్నాయి.



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం

**జన్నారం, జనవరి 19, ప్రభాతవార్త**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపిడివో షరీఫ్‌కు జాడి గంగాధర్ వినతి పత్రం అందజేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులకు ఇల్లుకు స్లాబ్ వేసిన తరువాత రెండు లక్షల రూపాయలు ఇస్తామని చెప్పారని కానీ ఒక లక్షా నలభై వేల రూపాయలు ఇస్తున్నారని, మిగతా అరవై వేల రూపాయలు ఉపాధిహామీలో ఇస్తున్నారని అలా కాకుండా రెండు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. అలాగే రైతులు వడ్లు అమ్ముకొని చాలా రోజులు గడుస్తున్న బోనస్ డబ్బులు రాక చాలా ఇబ్బందులు పడుతున్నారని వారికి బోనస్ డబ్బులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

## ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి వినతి

**మందమర్రి, జనవరి 19, ప్రభాతవార్త**

మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామ పంచాయతీలో గల ప్రాథమిక పాఠశాలకు ప్రహారీ గోడ నిర్మాణం చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎంపిఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ వినతి పత్రాన్ని తిరుపతి వార్డు సభ్యులు గ్రామస్థులతో కలిసి ఎంపీడీవో రాజేశ్వర్‌కు అందజేశారు. పాఠశాల ప్రాంగణం భద్రత దృష్ట్యా ప్రహారీ గోడ నిర్మాణం అత్యవసరమని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాజేశ్వర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## వన్యప్రాణుల గణన సిద్ధం

### నేటి నుంచి లెక్కింపు ప్రారంభం

**వేమనపల్లి, జనవరి 19, ప్రభాతవార్త**

నీల్వాయి రేంజ్ పరిధిలో జంతువు గణనకు సంబంధించి శాఖాహార, మాంసాహార జంతువులను వేరువేరుగా ట్రైల్స్, ట్రాన్స్ క్ట్ పేరుతో ఈ నెల 20 నుంచి 25 వరకు నీల్వాయి పరిధిలోని 20 బీటులలో గణన చేయనున్నారని నీల్వాయి ఎఫ్ఆర్ఓ అఫిజోద్దీన్ తెలిపారు. ఈ మూడు రోజులపాటు శాకాహార జంతువులతో పాటు చెట్లు, గడ్డి జాతులు కలుపు రకాలు, మరో మూడు రోజులపాటు పులులు, చిరుతల వంటి మాంసాహార జంతువుల గణన చేయనుండగా ప్రత్యేక అప్లికేషన్ ద్వారా ఈ గణన చేయనున్నారు. ఈ గణన ఉదయం 6:30 నుంచి 9 గంటల వరకు మధ్యాహ్నం 3.00 నుండి 5 వరకు చేయనుండగా ఈ సర్వేలో అధికారులు, వాలెంటెన్స్ పాల్గొననున్నారు. ఇప్పటికే శాఖాహార, మాంసాహార జంతువులు తిరిగే ప్రదేశాలు గుర్తించడంతోపాటు ఒక విడత మాదిరి శిక్షణ కూడా పూర్తి చేయటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ప్రమోద్ అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



అటవీ ప్రాంతంలో సిబ్బందికి శిక్షణ

## ఆధార్ అప్డేట్ కేంద్రం ఏర్పాటు

**బజార్‌హత్నూర్, జనవరి 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బజార్‌హత్నూర్‌లో సోమవారం ఆధార్ అప్డేషన్ క్యాంప్‌ను మండల తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో శ్రీనివాస్‌లు ప్రారంబించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆధార్ కార్డులో ఏమైనా తప్పులు ఉన్నచో వాటిని సరిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి రాంకిషన్, ప్రధానోపాధ్యాయులు జె భూమన్న, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఆధార్ అప్డేట్ కేంద్రంను ప్రారంభిస్తున్న అధికారులు



## రోడ్ సేఫ్టీపై అవగాహన మీటింగ్

**లక్షెట్టిపేట, జనవరి 19, ప్రభాతవార్త**

రోడ్ సేఫ్టీ పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. సోమవారం లక్షెట్టిపేట పట్టణంలోని బ్లాక్ స్పాట్ అయిన ఇటిక్యాల చౌరస్తాలో లక్షెట్టిపేట పోలీసులు డిజి ఉత్తర్వుల మేరకు రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. స్థానిక ఎస్సై సురేష్ సిబ్బందితో కలిసి గ్రామ ప్రజలకు రోడ్డు భద్రత గురించి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... వాహనదారులు రవాణా నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలు వాహనాల వెంట ఉంచుకోవాలని, కారు నడిపే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలని, ద్విచక్ర వాహనదారుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

**లక్షెట్టిపేట, జనవరి 19, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట పట్టణంలోని ఆంధ్ర కాలనీ ప్రభుత్వ పాఠశాలను సోమవారం మండల విద్యాధికారి శైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను పరిశీలించి, బోధనా తీరుపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. శిక్షణలో నేర్చుకున్న నూతన విధానాలను అనుసరిస్తూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆదేశించారు. మెరుగైన బోధనతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆమె పేర్కొన్నారు.





మాట్లాడుతున్న ఎస్సై రవీందర్

## క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు

**దిలావర్‌పూర్, జనవరి 20, ప్రభాతవార్త:**

చదువుతోపాటు క్రీడలలో రాణించాలని, క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలని ఎస్సై రవీందర్ అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామంలో సీఎం కప్ 2026 పోటీలను ఘనంగా ప్రారంభించారు. గ్రామీణ స్థాయిలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసేందుకే సీఎం కప్ పేరిట ఆట నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ రమణారెడ్డి తెలిపారు. విద్యార్థులకు ఆటలలో ప్రోత్సహం కలిగించేందుకు ఈ ఆటలను సద్వినియోగం చేసుకుంటామని ప్రధానోపాధ్యాయులు మధుసూదన్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సదానందం, సముందర్ పల్లి సర్పంచ్ జంగం రాధిక, వ్యాయ ఉపాధ్యాయుడు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



మహిళా సంఘ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర రెడ్డి

## నిర్మల్ పట్టణంలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

### - ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా చెక్కు పంపిణీ

**నిర్మల్, జనవరి 19, ప్రభాతవార్త:**

నిర్మల్ పట్టణంలో మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కును బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అందజేశారు. నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రూ. 27216714 విలువైన చెక్కును మహిళా సంఘ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఈ వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళా సాధికారతకు ఈ రుణాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఈ సహాయానికి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.





శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

# నూతన సర్పంచ్‌లు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 19, ప్రభాతవార్త:**

కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం బాసర ఐఐటీ సమావేశ హాల్లో నూతనంగా ఎన్నికైన భైంసా, లోకేశ్వరం మండలాల సర్పంచ్‌లకు నిర్వహించిన శిక్షణ శిబిరానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో సర్పంచ్ పదవి అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పంచాయతీరాజ్ చట్టం, సర్పంచ్ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సర్పంచ్‌లు కృషి చేయాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సర్పంచ్‌లు నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ, స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించేలా చూడాలని సూచించారు. సర్పంచ్‌లకు అవసరమైన సంపూర్ణ సహకారం జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. శిక్షణ తరగతుల్లో అధికారులు తెలియజేసే అంశాలను శ్రద్ధగా విని, తమ విధులపై మరింత అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లను వారి విధులు, బాధ్యతలపై ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, శిక్షణ తరగతుల రాష్ట్ర పరిశీలకులు శ్రీనివాస్, డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ పవన్ చంద్ర, ఎంపీఓ తిరుపతి రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి పౌరుని బాధ్యత

**బజార్‌హత్నూర్, జనవరి 19, ప్రభాతవార్త:**

రోడ్డు భద్రత ప్రతీ పౌరుని బాధ్యతఅని స్థానిక ఎస్సై సంజయ్ కుమార్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశానుసారం స్థానిక ఎస్సై సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషద్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత గురించి గ్రామ ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని, మైనర్లకు బైకులు ఇవ్వకూడదని, బైకులు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రజలందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, అలా పాటించని యెడల చట్ట పరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు అధికారులు, విద్యార్థులు

## విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

**బజార్‌హత్నూర్, జనవరి 19, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని మంగళవారం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ ఉప కేంద్రం బజార్‌హత్నూర్‌లో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక ఏర్పాటు చేయడం జరుగుతుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ జె లక్ష్మణ్ తెలిపారు. కావున బజార్‌హత్నూర్, ఇచ్చోడ, బోథ్, నేరడిగొండ మండలంలోని విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలు ఏవైనా ఉంటే తెలుపవలసిందిగా కోరారు.

## సాత్ నంబర్ గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

**నేరడిగొండ, జనవరి 19, ప్రభాతవార్త:**

ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీ భవనంలో నూతన సర్పంచ్ రాథోడ్ రమేష్, ఉపసర్పంచ్ షబ్బీర్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఎదురైనా అన్నగా భావించి తనను సంప్రదించవచ్చని తెలిపారు. కలిసికట్టుగా కదిలితే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రజల కోరిక మేరకు ఎన్‌హెచ్-44 సర్వీస్ రోడ్డు ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అలాగే బస్ స్టాప్ ఏర్పాటు కోరికను కూడా నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య

**మందమర్రి, జనవరి 19, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణంలోని మార్కెట్ ఏరియా మొదటి జోన్‌లో సోమవారం ఉదయం విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఆ ప్రాంతానికి చెందిన సబ్బని విజయలక్ష్మి (53) తన నివాసంలోని బాత్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల ప్రకారం.. మృతి చెందిన విజయలక్ష్మి గత పదేళ్లుగా పట్టణంలోని తవక్కల్ పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలిగా సేవలందించారు. ఆమె భర్త సబ్బని శేఖర్ మాజీ సింగరేణి ఉద్యోగి. దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఏడు నెలల క్రితం విజయలక్ష్మికి హైదరాబాద్‌లో పక్షవాతానికి సంబంధించి బ్రెయిన్ ఆపరేషన్ చేయగా, ఆపరేషన్ అనంతరం ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యల కారణంగా ఆమె తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. అనారోగ్య పరిస్థితుల నేపథ్యంలో ఉపాధ్యాయ వృత్తికి కూడా స్వస్తి పలకాల్సి వచ్చింది. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి లోనైన ఆమె, సోమవారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో బాత్‌రూమ్‌లోకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై భర్త సబ్బని శేఖర్ ఫిర్యాదు మేరకు మందమర్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజశేఖర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



సబ్బని విజయలక్ష్మి (ఫైల్ ఫోటో)

# ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ రాస్తారోకో

## ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్



**నస్పూర్, జనవరి 19, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీరాంపూర్, నస్పూర్ జోన్లలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ శ్రేణులు సోమవారం రాస్తారోకో నిర్వహించాయి. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్, నస్పూర్ జోనల్ అధ్యక్షులు సత్రం రమేష్, కుర్ర చక్రవర్తి మాట్లాడుతూ సీసీసీ కార్నర్ వద్ద బస్టాండు, పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో ప్రయాణికులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి స్థలాల్లో నివాసాలు ఏర్పరుచుకున్న వారికి శాశ్వత ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఎన్నికల వాగ్దానం ప్రకారం రిటైర్డ్ కార్మికులకు రెండు గుంటల భూమితో పాటు ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. పట్టణంలో శాశ్వత డంప్ యార్డ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారుల్లో వీధిదీపాలు, కాలనీల్లో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కుక్కల బెడదను నివారించాలని, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి సారథ్యంలో మంచిర్యాల కార్పొరేషన్ ను బీజేపీ కైవసం చేసుకుంటుందని నేతలు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వంగపల్లి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి మొగిలి, జీవీ ఆనంద్ కృష్ణ, సుమన్ యాదవ్, బూర్ల చిరంజీవి, కొయ్యడ పద్మ, కట్కూరి తిరుపతి, రవణవేణి శ్రీనివాస్, మిడిదొడ్డి సతీష్, తరాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## జున్నిలో పర్యటించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### - బీఆర్ఎస్‌లో చేరిన స్వతంత్ర సర్పంచ్ విట్ఠల్

**నేరడిగొండ, జనవరి 19, ప్రభాతవార్త:**

ఇచ్చోడ మండలంలోని జున్ని గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని కూడా ఆయన ప్రారంభించారు. గ్రామానికి బీటీ రోడ్డు మంజూరవడంతో, ప్రస్తుతం తాత్కాలికంగా వేసిన గ్రావెల్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన సర్పంచ్ సుమన్ బాయి విట్ఠల్ గ్రామస్తులతో కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామమంతా ఏకమై పార్టీ కండువా కప్పుకోవడంతో గ్రామం గులాబీ మయంగా మారింది. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ గ్రామస్తుల చిరకాల కోరిక మేరకు బీటీ రోడ్డు మంజూరు చేయడం జరిగిందన్నారు. జున్ని గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శాంతబాయి శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయులు

## ఇప్పపువ్వు లడ్డుకి గౌరవం దక్కడం హర్షణీయం

**నార్నూర్, జనవరి 19, ప్రభాతవార్త:**

మండలంలోని ఖైర్డాట్వ గ్రామంలో ఏర్పాటు కేంద్రంలో తయారు చేసే ఇప్పపువ్వు లడ్డూకు గౌరవం దక్కడం హర్షణీయమని ప్రధానోపాధ్యాయుడు బానోత్ రామారావు అన్నారు. ఇప్పపువ్వు లడ్డూ తయారు దారులు పెందుర్ శాంతబాయి శ్రీనివాస్ దంపతులకు దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనుటకు రాష్ట్రపతి భవన్ నుండి ఆహ్వానం అందిన సందర్భంగా వారిని పాఠశాల సిబ్బంది శాలువాతో సన్మానం చేశారు. నార్నూర్ మండల ప్రగతిని దేశ రాజధానిలో చాటాలని అన్నారు. కార్యక్రమంలో పెందుర్ లింగుబాయి, మడావి దత్తు, గ్రామస్తులు ఉన్నారు.

## ఘనంగా సీఎం కప్ పోటీలు ప్రారంభం

**సారంగాపూర్, జనవరి 19, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండల కేంద్రంలో రాంపూర్ క్లస్టర్‌లోని రాంపూర్, తెంబరేణి, అంజనితండా, కుస్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన క్లస్టర్ స్థాయి సీఎం కప్ పోటీలను సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సాపూర్ నందు ఘనంగా ప్రారంభించారు. ఈ పోటీలను మండల విద్యాధికారి వై. సాయన్న, స్థానిక సర్పంచి ఇంద్రకరణ్ రెడ్డి, తెంబరేణి సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, అంజని తండా సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర కుమార్‌లు ప్రారంభించారు. నాలుగు గ్రామ పంచాయతీలకు సంబంధించిన సుమారు 200 మంది క్రీడాకారులు ఈ క్రీడలలో పాల్గొన్నారు. స్థానిక ఫిజికల్ డైరెక్టర్ దర్శనం దేవేందర్, కస్తూర్బా గాంధీ వ్యాయము ఉపాధ్యాయురాలు లావణ్య, స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు సంపత్ కుమార్, సాయిరాజ్ వివిధ క్రీడాంశాలలో, క్రీడాకారులను మండల స్థాయికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా మంగళవారం నర్సాపూర్(జి) చాక్పల్లి క్లస్టర్లు క్రీడా పోటీలు నిర్వహించబడతాయని వ్యాయము ఉపాధ్యాయులు తెలిపారు.



క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు



భోనం సమర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ మహిళలు

## బోనమెత్తిన విశ్వబ్రాహ్మణ కులస్తులు

**సారంగాపూర్, జనవరి 19, ప్రభాతవార్త:**

మండలంలోని అన్నిగ్రామాలలో విశ్వబ్రాహ్మణులు పూర్వాచారం ప్రకారం బోనం సమర్పించారు. సంక్రాంతి తర్వాత వచ్చే అమావాస్య రోజు చలి బోనాలు మరుసటి ఉదయం వేడి బోనాలు సమర్పిస్తారు. తమ పిల్లాపాపలు చల్లంగా ఉండాలని గ్రామ దేవతలకు బోనాలు వేస్తారు. అనంతరం వచ్చే ఆదివారము ఊర్లో వారందరూ బోనాలు వెస్తారు అప్పటినుండి శుభకార్యాలు జరుపుకోవడానికి సుముఖంగా ఉంటుందని భక్తుల నమ్మకం. ఇది పురాతన సాంప్రదాయం అని భక్తులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత అందరి బాధ్యత

**సిరికొండ, జనవరి 19, ప్రభాతవార్త:**

రోడ్డుపై ప్రయాణించే వాహనదారుల సురక్షిత ప్రయాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఏఎస్సై బలిరాం అన్నారు. సోమవారం సిరికొండ మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం కోసం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు నియమాలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న ఏఎస్సై బలిరాం

## కొండాపూర్ శివాలయంలో మోని అమావాస్య ప్రవచన కార్యక్రమం

**సిరికొండ, జనవరి 19, ప్రభాతవార్త:**

మోని అమావాస్యను పురస్కరించుకొని సిరికొండ మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఉన్న అతి పురాతన శివాలయ ప్రాంగణంలో సోమవారం నివార్తి మహారాజ్ ప్రవచన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిరికొండ మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రవచన కార్యక్రమం అనంతరం ఇచ్చోడ మండలం మాదాపూర్‌కు చెందిన భక్తుడు జాదవ్ గోవింద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.



## మద్యం సేవించి వాహనలు నడప రాదు

### - ఎస్సై శ్రీకాంత్

**సారంగాపూర్, జనవరి 19, ప్రభాతవార్త:**

మత్తు సేవించి వాహనలు నడప రాదని స్థానిక ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రంలో పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం 5వ రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ పోలీస్, రవాణా, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా అరైవ్ అలైవ్ - 2026 పేరిట రోడ్డు భద్రతా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. రోడ్డు భద్రత, తాగి వాహనాలు నడిపితే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. దాని ద్వారా జరిగే అనార్థాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది లింగరం, ప్రణీత్ రెడ్డి పాల్గొన్నారు.



# గ్రామీణ పరిపాలనలో సర్పంచుల పాత్ర కీలకం

### - ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:**

గ్రామీణ పరిపాలనలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం జిల్లా పంచాయతీ రాజ్ వనరుల కేంద్రం సమావేశ మందిరంలో జిల్లాలోని నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ పరిపాలనలో సర్పంచుల పాత్ర కీలకమని, గ్రామాభివృద్ధిలో వారిని బలోపేతం, భాగస్వామ్యం చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు నూతన సర్పంచులకు నేటి నుండి ఫిబ్రవరి 27, 2026 వరకు విడతల జరగనున్న ఈ శిక్షణలో సర్పంచుల అధికారాలు, బాధ్యతలు, విధులపై పూర్తి అవగాహన కల్పించడం తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల వినియోగం పై వివరించడం జరుగుతుందని అన్నారు. గ్రామ ప్రణాళికలో బాగంగా పారిశుధ్యం, త్రాగునీరు, వీధి దీపాలు, మౌలిక వసతుల కల్పనలో తీసుకోవాల్సిన చర్యలు, రికార్డులను, ఆడిటింగ్ నిర్వహణ, సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేర్చడంలో సర్పంచుల పాత్ర, ఇతర అంశాలపై వివరంగా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. సర్పంచులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, తమ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం నూతన సర్పంచ్ లు కలెక్టర్ ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రమేష్, డిఆర్డీఓ రవీందర్, డీఎల్పిఓ ఫణిందర్, ఎంపీడీవో రమేష్, సర్పంచ్ లు, తదితరులు పాల్గొన్నారు.





ఎస్పీ కాజల్ సింగ్‌ని సన్మానిస్తున్న ఉట్నూర్ నాయకులు

## ఉట్నూర్ ఎస్పీ కాజల్ సింగ్ కి సన్మానం

**ఉట్నూర్, జనవరి 19, ప్రభాతవార్త :**

బదిలీపై హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి గా వెళుతున్న కాజల్ సింగ్ ను సన్మానిస్తున్న వివిధ ఆధ్యాత్మిక సంఘాల ప్రతినిధులు. ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత ప్రజలు, నాయకులు శాంతిమైనా వాతావరణంలో ఉండి మంచి సహాయ సహకారాలు అందించరని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమం లో శ్రీరామ్ నాయక్, గోపి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు

**ఆసిఫాబాద్, జనవరి 19, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన వేములూరి వెంకటేశ్వర్ తన కూతురుకు గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానేపల్లి మండలం నందికొండ గ్రామానికి చెందిన టాకిరే పద్మ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, జైనూర్ మండలం దుబ్బాగూడ గ్రామానికి చెందిన పెందూర్ జంగు తన పెద్దనాన్న పేరిట ఉన్న పట్టాలో తమ వాటా ఇప్పించాలని, కౌటాల మండలం మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన నరులే గను తన పేరిట పట్టా గల భూమిని ఆన్ లైన్ లో మిస్సింగ్ అయినందున వివరాలు నమోదు చేసి పట్టా మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ పట్టణం జనకాపూర్ కు చెందిన ఆనంద్ రావు తన తండ్రి పేరిట గల పట్టా భూమిని విరాసత్ చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత

## విద్యార్థులకు ఇంగ్లీష్ భాష పటుత్వ పోటీలు

**వేమనపల్లి, జనవరి 19, ప్రభాతవార్త**

ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో సోమవారం వేమనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు (ఎల్టా)జిల్లా జాయింట్ సెక్రెటరీ ఎ. రాజన్న, మండల విద్యాధికారి బి.శ్రీధర్ రెడ్డి మండల స్థాయి ఆంగ్ల భాష నైపుణ్య పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీలలో విజేతలుగా నిలిచిన ఆస్త్ర, శశివర్ధన్, శ్రావణి, సమత విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇటువంటి భాష నైపుణ్య పోటీల్లో పాల్గొనడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని భవిష్యత్తులో ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ఇవి ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి నెట్ బాల్ పోటీల్లో డిగ్రీ విద్యార్థినికి ప్రతిభ

**బెల్లంపల్లి, జనవరి 19, ప్రభాతవార్త**



బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ బీజెడ్‌సి మొదటి సంవత్సరం విద్యార్థిని సనా అంజుమ్ జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించడం పట్ల ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ రఫీక్ మహమ్మద్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాదు లోని గచ్చిబౌలిలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు ఈ పోటీలు జరుగగా విద్యార్థిని సానా అంజుమ్ పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో తెలంగాణ తరఫున పాల్గొని మూడవ స్థానం పొందిందని పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలలో విద్యార్థిని సనా అంజుమ్ కు శాలువా కప్పి సత్కరించారు. సానా అంజుమ్ మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, జాతీయ అంతర్జాతీయ స్థాయిలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్, వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ రఫీక్ మహమ్మద్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# నవీన్ యాదవ్‌కి మంత్రి పదవి ఇవ్వాలి

### - డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్

**జైపూర్, జనవరి 19, ప్రభాత వార్త:**

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అన్నా అంటే నేనున్నా అంటూ ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు చిన్న శ్రీశైలం యాదవ్ కుమారుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర, గొర్రె మేకల పెంపకం వృత్తి దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం భీమారం ప్రెస్ క్లబ్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్, మంత్రులు ఎమ్మెల్యేలు కలిసి మంత్రి పదవి ఇవ్వాలని విన్నవించినట్లు తెలిపారు. తెలంగాణలో రాష్ట్ర వ్యాప్తంగా 20 శాతం జనాభా ఉన్న గొల్ల, కురుమలకు మంత్రి పదవి ఇచ్చి తగిన న్యాయం చేయాలని యాదవ సామాజిక వర్గంలో ఒక్క మంత్రి పదవి కూడా లేదని, ఏమ్మెల్యే నవీన్ యాదవ్ కి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో ఇంచార్జిగా చెన్నూరు నియోజకవర్గం శాసనసభ్యులు మైనింగ్ శాఖ కార్మిక శాఖ మంత్రి వివేక్ నవీన్ యాదవ్ గెలుపుకు కృషి చేశారాని మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామికి హృదయపూర్వకంగా కృతజ్ఞత ధన్యవాదములు తెలియజేశారు. నవీన్ యాదవ్ మంత్రి పదవి కోసం వివేక్ సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల గౌరవ అధ్యక్షులు కొమ్ము లింగన్న యాదవ్, చెన్నూర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మిండే మల్లేష్ యాదవ్, భీమారం మండల అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్, మండల నాయకులు ఉపసర్పంచ్ కోలాకిట్టయ్య యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ధారవెణ తిరుపతి యాదవ్, ఉపాధ్యక్షులు కేశవేణి సత్యనారాయణ యాదవ్ యాదవ సంఘం యూత్ అధ్యక్షులు పుట్ట రాజేందర్, యాదవ సంఘం అధ్యక్షులు తువ్వ తిరుపతి యాదవ్, కొమ్ము కొమరన్న యాదవ్, చవ్వ శివయాదవ్, మారం మల్లేష్ యాదవ్ నాయకకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్

## 21న మార్కండేయ జయంతి వేడుకలు

### - రుద్ర హోమం, అన్నప్రసాద వితరణ

**నస్పూర్, జనవరి 19, ప్రభాతవార్త**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ శ్రీ లక్ష్మి గణపతి శివ మార్కండేయ దుర్గ మాత దేవాలయంలో ఈ నెల 21న మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. మాఘ శుద్ధ తదియ బుధవారం పురస్కరించుకుని ఉదయం ఆలయ ప్రాంగణంలో జెండా ఆవిష్కరణ, ప్రత్యేక రుద్ర హోమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ, పద్మశాలి సంఘం ప్రతినిధులు తెలిపారు. మార్కండేయ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పద్మశాలి కులబాంధవులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. హోమ పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవాలకు సంబంధించి ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



శ్రీ లక్ష్మి గణపతి శివ మార్కండేయ దుర్గ మాత దేవాలయం

# మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు



ఆదిలాబాద్, జనవరి 19, ప్రభాతవార్త:

మహిళల ఆర్థికాభివృద్దే ప్రభుత్వ ధ్యేయం అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా వడ్డీ లేని రుణాలు, చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 1049 సంఘాలకు గాను రూ. 4,25,70,880/ విలువైన వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని, ఈ నిధులు డీబీటీ పద్ధతి ద్వారా నేరుగా సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని అన్నారు. మహిళలు కట్టిన వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ తిరిగి చెల్లిస్తోందని తెలిపారు. ఈ డబ్బును కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఆరోగ్యం లేదా వ్యాపార విస్తరణకు వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. పట్టణంలో సుమారు 11,000 మంది మహిళలకు (దాదాపు 30 కుటుంబాలకు) దీని ద్వారా లబ్ధి చేకూరుతోందని అన్నారు. మహిళలు ఇప్పటికే ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, విజయ డెయిరీ పార్లర్లు, స్కూల్ యూనిఫామ్ కుట్టు పని, పెట్రోల్ బంకుల నిర్వహణలో రాణిస్తున్నారని, అలాగే ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా ఉత్పత్తులను విక్రయించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 1049 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ. 4 కోట్ల 25 లక్షల 70 వేల 880 రూపాయల వడ్డీ లేని రుణాల చెక్కును కలెక్టర్, అదనపు కలెక్టర్, గ్రంథాలయ చైర్మన్ అందజేశారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి చీరలను మహిళలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, డి.ఎం.సి మెప్మా శ్రీనివాస్, టి.ఎం.సి మెప్మా భాగ్యలక్ష్మి, సిబ్బంది, ఆర్.పి.లు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న సర్పంచ్ ఉస్మాన్

## పెంచికల్ పేట్ అభివృద్ధికి సహకరించండి..?

### - మంత్రి జూపల్లికి పెంచికల్ పేట్ సర్పంచ్ వినతి

పెంచికల్‌పేట్, జనవరి 19, ప్రభాతవార్త

పెంచికల్‌పేట్ సర్పంచ్ షేక్ ఉస్మాన్ సోమవారం కాగజ్‌నగర్‌లో జరిగిన 100 పడకల ఆసుపత్రి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి పెంచికల్ పేట్ గ్రామం, మండలానికి సంబంధించిన మౌలిక సమస్యలపై వినతి పత్రం అందజేశారు. పెంచికల్ పేట్ మండలం ఏర్పడి దశాబ్దం పూర్తయినా ఇప్పటికీ మండల కార్యాలయాలకు స్వంత భవనాలు లేవని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే 300 సంవత్సరాల చరిత్ర కలిగిన పెంచికల్ పేట్ గ్రామంలోని పురాతన భద్రకాళి ఆలయంలో శివరాత్రి సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు సందర్శిస్తారని, ఆలయానికి సరైన రోడ్డు, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించాలని పేర్కొన్నారు. మండల కేంద్రంలో జూనియర్ కాలేజ్, బిసి హాస్టల్ ఏర్పాటు, 20 వేల జనాభా కలిగిన మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శాశ్వత డాక్టర్ల నియామకంతో పాటు కనీస 10 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ, 24 గంటల అంబులెన్సు సౌకర్యం కల్పించాలని కోరారు. పెంచికల్ పేట్, అగర్ గూడ, మురళీగూడ, గ్రామాలకు మండల కేంద్రం నుండి బస్సు సౌకర్యం కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అర్థించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉస్మాన్‌ను మంత్రి చాలువతో సత్కరించారు. మండల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సహకరించిన ఎమ్మెల్సీ దండే విఠల్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# రైల్వే లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

### - సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

బెల్లంపల్లి, జనవరి 19, ప్రభాతవార్త



దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న లోకో పైలట్ల సమస్యలు కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ సిహెచ్ శంకర్రావు, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రెటరీ రవీందర్రావులు ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం బెల్లంపల్లి పట్టణంలోని లోకో క్రూలాబీ ఎదుట లోకో పైలట్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచి చైర్మన్ ఎస్ నాగరాజు, సెక్రెటరీ జీ సాంబశివుడు మాట్లాడారు. లోకో పైలట్లకు కేంద్ర ప్రభుత్వం 120 కిలోమీటర్లకు అలవెన్స్ చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు పరచాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాలు ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతాయని లోకో పైలట్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ట్రెజరర్ షోకేస్ మీనా, నాయకులు నీరజ్ అగర్వాల్, మీనా, వివేక్ లతో పాటు పెద్ద సంఖ్యలో పైలెట్లు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకట స్వామి

## క్యాతనపల్లి మున్సిపాలిటీ ఇందిరా మహిళా శక్తి సంబరాలు

### - రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్, జనవరి 19, ప్రభాతవార్త

క్యాతన్ పల్లి మున్సిపాలిటీలో ఇందిరా మహిళా శక్తి సంబురాలు జరుగుతున్నాయని రాష్ట్ర కార్మిక, శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం స్వయం సహాయక మహిళా సంఘాల మహిళలకు 1.71 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించేలా మహిళా స్వయం సహాయ సంఘాల మహిళల అభివృద్ధి కోసం వడ్డీ లేని రుణాలు,పెట్రోల్ బంక్‌లను అందజేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత క్యాతనపల్లి మున్సిపాలిటీలో 35 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు. గత బిఆర్ఎస్ 10 ఏండ్ల పాలనలో గ్రామాలు పట్టణాల్లో ఏమి అభివృద్ధి చేయలేదని,కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్ట్ లు చేపట్టారని అన్నారు.క్యాతనపల్లి లో 16 వందల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో అర్హులైన పేదలకు 150 ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని అన్నారు.

# ముక్కిడి పోచమ్మ జాతర ఏర్పాట్లు ముమ్మరం

### - భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

### - జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్

నస్పూర్, జనవరి 19, ప్రభాతవార్త

నస్పూర్ మండల కేంద్రంలోని ముక్కిడి పోచమ్మ ఆలయ ఆవరణలో సింగరేణి యాజమాన్యం నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ఆలయ పరిసరాలను నిరంతరం శుభ్రంగా ఉంచాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లు, నీటి ట్యాంకర్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. అత్యవసర వైద్యం కోసం ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్స్ సదుపాయం సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. భద్రత పరంగా పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. సింగరేణి కార్మికులు, స్థానిక ప్రజల సహకారంతో జాతరను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎంలు రవీందర్, ఎం. రాజేష్, సెక్యూరిటీ అధికారి జక్కా రెడ్డి, సీనియర్ పీవో ఎస్. సురేందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్

# ఆటకు ప్రాణం వ్యాయామ ఉపాధ్యాయుని శిక్షణ

### - మండల విద్యాధికారి సదానందం

దిలావర్‌పూర్, జనవరి 20, ప్రభాతవార్త:



ఆటకు ప్రాణం వ్యాయామ ఉపాధ్యాయుని శిక్షణ అని మండల విద్యాధికారి సదానందం అన్నారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో సోమవారం ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల కాలసూచిని జిల్లా అధ్యక్షులు గుగులోత్ అంబాజీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి సదానందం మాట్లాడుతూ విద్యార్థులను క్రమశిక్షణలో, ఆటలలో నైపుణ్యాలను పెంపొందించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని మండల విద్యాధికారి సదానందం అన్నారు. విద్యార్థులను శారీరకంగా దృఢంగా ఆరోగ్యంగా తీర్చిదిద్దడంలో తీర్చిదిద్దడంలో వారు చాలా ముఖ్యమని తెలిపారు. సెల్ ఫోన్లకు బానిసై ఆటలకు దూరమవుతున్న వేళలో విద్యార్థులలో క్రీడలపై ఆసక్తి పెంచుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.